మట్టిగణపతి ప్రతిష్ఠాపనకు నేడు కర్రపూజ

సుభాష్‌నగర్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతిని ప్రతిష్ఠించనున్నట్లు శ్రీవినాయక యువజన సంఘం అధ్యక్షుడు శీలం వీరేందర్‌కుమార్ తెలిపారు. సూరారం కాలనీ భవానీనగర్ లో గురువారం కర్ర పూజ నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ పూజా కార్యక్రమానికి స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు పోలీస్ సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్‌లోని అజుదా హాస్పిటల్స్ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పోలీస్ సిబ్బందికి ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ భరత్‌కాంత్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేట్‌బషీరాబాద్ ఆవరణలో వైద్యం శిబిరం కొనసాగనుంది. శిబిరంలో సీబీపీ, ఆర్‌బీఎస్, సెరమ్ క్రియాటిన్, లిపిడ్ ప్రొఫైల్, బ్లడ్ యూరియా, బ్లడ్ గ్రూప్, ఈసీజీ, థైరాయిడ్ ప్రొఫైల్స్, లివర్ ఫంక్షన్ టెస్టులు ఉచితంగా నిర్వహించనున్నారు. పోలీస్ కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సుభాష్‌నగర్: మట్టి రోడ్ల స్థానంలో పక్క సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తామని మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్ సూరారం రాజీవ్ గృహకల్పలోని 18 బ్లాక్ నుంచి 23 వరకు రూ.30 లక్షలతో ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్డు పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు శివగౌడ్, రత్నం, సంధ్య, తారా సింగ్, భాస్కర్, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

సదస్సుకు తరలిన కళాకారులు

జగద్గిరిగుట్ట: వరంగల్‌లో బుధవారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర బ్యాండ్ కళాకారుల సదస్సుకు జగద్గిరిగుట్ట నుంచి సరస్వతి కళాకారులు సంఘం అధ్యక్షులు ఎండీ మహ్మద్, ఉపాధ్యక్షులు శేఖర్ ఆధ్వర్యంలో బయలుదేరారు. కళాకారులకు గుర్తింపు కార్డులు, వృత్తి శిక్షణా కేంద్రాలు, వృద్ధాప్య పింఛన్లు, పోలీసుల నుండి రక్షణ తదితర అంశాలపై ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. రాష్ట్ర సదస్సులో వివిధ అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

కల్లు కంపౌండ్లపై దాడులు

వేర్వేరు చోట్ల అరెస్టులు, కేసులు నమోదు



కల్లు శాంపిల్లను సేకరించిన అధికారులు

సాక్షి,మేడ్చల్ జిల్లా: కల్లు కంపౌండ్లపై ఎస్టీఎఫ్ టీమ్‌లు బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశాయి. ఇటీవల కల్తీకల్లు అమ్మకాలు, అనుమతిలేని కల్లు డిపోల నిర్వహణ, అనుమతి లేకుండా కల్లు రవాణా జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని కూకట్‌పల్లి కల్తీకల్లు ఘటనతో హైదరాబాద్ సహా నగరంతో పాటు తెలంగాణ వ్యాప్తంగా 'ప్రొహిబిషన్‌అండ్ ఎక్సైజ్' కమిషనర్ హరికిరణ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం కల్లు కాంపౌండ్‌లను తనిఖీ చేశారు. బుధవారం దూల్‌పేట్‌లో ఎస్టీఎఫ్ టీమ్ లీడర్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో మూడు చోట్ల దాడులు నిర్వహించి, కేసులు నమోదు చేశారు.

◆ దూల్‌పేట్, మల్లాకుంట ప్రాంతంలో బైక్‌పై అక్రమంగా తరలిస్తున్న 70లీటర్ల కల్లును స్వాధీనం చేసుకున్నారు. ఈ కల్లు శాంపిల్ తీసుకుని మిగిలిన దానిని పారబోశారు. ఈ కేసులోని నిందితుడిని అదుపులోకి తీసుకుని, మరొకరిపై కూడా కేసు నమోదు చేశారు. - దూల్‌పేట్‌లోని మంగళ్‌హాట్ ప్రాంతంలో 247 లీటర్ల కల్లుకు అనుమతిలేకపోవడంతో పారబోసి, ఒకరిని అరెస్టు చేసి మరొకరిపై కేసు నమోదు చేశారు.


◆ గుడిమల్కాపూర్ హీరానగర్‌లో అనుమతిలేని కల్లు డిపోలోని 382 లీటర్ల కల్లును పారబోశారు. గోదా రాఘవేందర్‌గౌడ్‌ను అరెస్టు చేసి, రామకృష్ణగౌడ్‌పై కేసు నమోదు చేశారు. ఈ మూడు కేసులను దూల్‌పేట్ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు. మరో రెండు కేసుల్లో ఎస్టీఎఫ్ టీమ్ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, నాగరాజు ఆధ్వర్యంలో శేరిలింగంపల్లిలో కల్లు డిపోలపై దాడులు నిర్వహించి శాంపిల్స్‌ను సేకరించారు. హైదర్‌నగర్, రంగారెడ్డి నగర్, తర్కముల్ ప్రాంతాల్లోని కల్లు డిపోల్లో దాడులు నిర్వహించి శాంపిళ్లను సేకరించారు.

ముమ్మరంగా పార్కుల అభివృద్ధి

వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణం, ఓపెన్‌జిమ్‌ల ఏర్పాటు

రూ.3 కోట్ల నిధులతో పనులు

నిజాంపేట్: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పార్కుల అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గ్రామ పంచాయతీల నుంచి మున్సిపల్ కార్పొరేషన్‌గా మారిన తరువాత అనేక పార్కులు అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో పెరుగుతున్న జానాభా అవసరాలకు పార్కులు ఉపయోగంలో లేకుండా పోయాయి. కార్పొరేషన్ పరిధిలో పార్కుల అభివృద్ధి కోసం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.3 కోట్ల నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నారు. అధికారులు చేపడుతున్న ఈ చర్యల వల్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని రాజీవ్ గృహకల్ప సముదాయంలోని పార్కు, శ్రీనివాస్‌నగర్, సరోజినీ నాయుడు పార్కు, శిల్ప లేవుట్‌లో, వాసవి లేవుట్‌లోని రాధాకృష్ణ పార్కుల్లో పనులు ప్రారంభించారు.



హైమాస్ లైట్ల ఏర్పాటు



ప్రగతినగర్ పార్కులో నిర్మిస్తున్న వాకింగ్ ట్రాక్



పార్కుల్లో పరికరాలు

పార్కుల అభివృద్ధిలో భాగంగా వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు, చిన్న పిల్లలు ఆడుకునే పరికరాలు, సేద తీరేందుకు బెంచీలను పార్కుల్లో ఏర్పాటు చేస్తున్నారు. హైమాస్ లైట్లు సైతం ఏర్పాటు చేస్తున్నారు. అభివృద్ధి పనులతో పాటు పర్యావరణం కోసం మొక్కలు నాటి సంరక్షణ చర్యలు తీసుకుంటున్నారు.

ప్రజలకు అందుబాటులోకి తెస్తాం



మున్సిపల్ కార్పొరేషన్‌లోని పార్కుల్లో అన్ని వసతులు కల్పిస్తున్నాం. పార్కులు, సీసీ రోడ్లు, డ్రైనేజీ లైన్లు, స్ట్రీట్ లైట్ల ఏర్పాటు పనులు వేగంగా చేస్తున్నాం. పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదాన్ని అందిస్తాం.

– సాబేర్ అలీ, కమిషనర్ నిజాంపేట్

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్

దుండిగల్: స్వయం సహాయక బృందాలు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మహిళా స్వయం సహాయ గ్రూపు సభ్యులకు బ్యాంక్ అధికారులతో కలిసి రూ. 5 కోట్ల రుణాలను అందించారు. అదే విధంగా ఆన్‌లైన్ ఇంటర్నెట్ బ్యాంకింగ్ క్యూఆర్ కోడ్‌లు, మొదలగు వివరాలను ఎల్‌ఈడీ స్క్రీన్ పైన అందరికీ ఎలా చేయాలో వివరించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో ఫోన్‌కు వచ్చే ఓటీపీ వివరాలు తెలియజేయవద్దని సూచించారు. ఎవరైనా సైబర్ సంబంధించి సమస్య ఎదుర్కొంటే 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ శేఖర్, రామచంద్ర రావు, ముకుల్, ఫీల్డ్ ఆఫీసర్ నరేంద్ర కుమార్, మెప్మా సీఓ మంజుల, మెప్మా రిసోర్స్ పర్సన్స్ శాంత, రాణి, మల్లేశ్వరి, నాగమణి, ఆదిలక్ష్మి, అరుణ, మమత, గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.



బ్యాంక్ రుణాలు అందజేస్తున్న అధికారులు

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ నాగరాజు

కుత్బుల్లాపూర్: చిన్నతనం నుండే విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలని అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు అన్నారు. బుధవారం బొల్లారంలోని హోలీ ఏంజెల్స్ స్కూల్‌లో విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌ను వివరించారు. రోడ్లపై ఆటలు ఆడొద్దని, ఎల్లప్పుడు ఫుట్ పాత్‌లపై నడవాలని, మైనర్లు వాహనాలు నడపకూడదని వివరించారు. సిగ్నల్స్ సమీపంలో జీబ్రా లైన్ల మీదుగానే నడవాలని, ఈ విషయాన్ని తమ తల్లిదండ్రులతో పాటు చుట్టు పక్కల వారికి అవగాహన కల్పించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వల్ల ప్రమాదాలు నివారించవచ్చన్నారు.

సభకు తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు



పింఛన్‌దారుల సన్నాహక సభకు తరలి వెళ్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం పింఛన్లు పెంచే విషయంలో తాత్సర్యం చేస్తోందని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాసమల్ల యాదగిరిమాదిగ అన్నారు. మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు బుధవారం నేరెడ్‌మెట్‌లో నిర్వహించనున్న పింఛన్‌దారుల సన్నాహక సభకు నాయకులు, పింఛన్‌దారులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృద్ధులు, వితంతువులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6వేల పింఛన్‌లు అందిస్తామని చెప్పిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా నెరవేర్చకుండా తప్పించుకునే ధోరణి అవలంభిస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే ఎన్నికల హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిలువేరు శ్రీనివాస్, రమేష్ , మహిళా సమాఖ్య మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు సలోమి, లక్ష్మి, భూమయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి తెప్పించి.. చదును చేయించి!

రోడ్డుపై బస్సులు ఆపకుండా చర్యలు

జీడిమెట్ల: జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న బస్టాప్ ముందు రోడ్డుపైన బస్సులను ఆపడంతో ప్రతినిత్యం ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. ఇది గమనించిన ఇన్‌స్పెక్టర్ మల్లేష్ బస్సు డ్రైవర్లను ప్రశ్నించారు. రోడ్డు కిందిభాగం బాగా లోతుగా ఉండటంతో రోడ్డుపైన నిలుపుతున్నామని డ్రైవర్లు సమాధానమిచ్చారు. వెంటనే ఇన్‌స్పెక్టర్ డీఎం ఆంజనేయులుతో కలిసి టిప్పర్ల ద్వారా మట్టి తెప్పించారు. రోడ్డు కిందిభాగంలో పోయించి చదును చేయించారు. దీంతో బస్సులను డ్రైవర్లు రోడ్డు కింది వైపున నిలుపుతుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటం లేదు.



మట్టి పోయకముందు



మట్టి పోసిన తరువాత

మద్యం మత్తులో ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: మద్యం మత్తుతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. అస్సాం రాష్ట్రానికి చెందిన మహేష్ టాస(21) 15 రోజుల క్రితం దూలపల్లి గ్రామంలో ఉంటున్న ప్రణబ్‌దాస్ వద్దకు వచ్చాడు. స్థానికంగా ఉన్న ఆంధ్ర పాలిమార్ కంపెనీలో పని చేస్తున్న మహేష్ కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటున్నాననే బాధతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మద్యం మత్తులో బుధవారం తెల్లవారుజామున దూలపల్లి ప్రశాంత్‌నగర్ సమీపంలోని అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరి వేసుకున్నాడు. ప్రణబ్‌దాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో ఉన్న వ్యక్తిని కాపాడిన ఫైర్ సిబ్బంది

నిజాంపేట్: బాచుపల్లిలోని కేవీఆర్ రెయిన్‌బో కాలనీ వద్ద ఒక వింత సంఘటన చోటు చేసుకుంది. గుర్తు తెలియని ఓ వ్యక్తి రెయిన్‌బో అపార్ట్‌మెంట్‌లోని 5వ అంతస్తులో దర్శనమిచ్చాడు. స్థానికులు కంగారు పడి కూకట్‌పల్లి అగ్నిమాపక సిబ్బందికి తెలియజేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే చేరుకుని ఆ వ్యక్తిని రక్షించారు. తాను ఎండీ మోయిన్ (45) బొల్లారంలో నివాసం ఉంటున్నట్లు తెలిపారు. ఇంతకి అతను ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చాడా? లేక దొంగతనానికి వచ్చాడా? అనేది తెలియాల్సి ఉంది.

మరమ్మతులు చేయరూ !



రంగారెడ్డినగర్: పాదాచారులు, వాహనదారుల సౌకర్యార్థం జంట సర్కిళ్ల పరిధిలోని ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణను పట్టించుకునే నాధుడే కరువయ్యారు. ఇప్పటికే చాలా చోట్ల టాయిలెట్లలో నల్లాలు, కమోడ్‌లు మాయమయ్యాయి. ఉన్న వాటి నిర్వహణ లేక నిరుపయోగంగా మారుతున్నాయి. కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తా సమీపంలో మున్సిపల్ గ్రౌండ్‌ను ఆనుకుని ఉన్న టాయిలెట్ కూలడానికి సిద్ధంగా ఉంది. టాయిలెట్ బేస్‌మెంట్ తుప్పు పట్టడంతో ఓ వైపుకు ఒరిగింది. దీంతో దాన్ని వినియోగించుకునేందుకు ప్రజలు జంకుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి టాయిలెట్ల నిర్వహణను పట్టించుకోవాలని పలువురు కోరుతున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

జగద్గిరిగుట్ట: షార్ట్ సర్క్యూట్‌తో చిప్స్ కంపెనీ గోదాములో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. పాపిరెడ్డి నగర్‌లో బుధవారం తెల్లారు జామున 3 గంటల సమయంలో హల్దీరాం, చిప్స్ కంపెనీ, సూర్య ఎంటర్ ప్రైజెస్‌లో ఆకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. నివాస ప్రాంతాల్లో గోదాము ఉండటంతో స్థానికులు దట్టమైన పొగలతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది 2 ఫైర్ ఇంజన్‌లతో మంటలను అదుపు చేశారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని, ఆస్తి నష్టంపై ఆరా తీస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇళ్లు కోల్పోతున్న వారిని ఆదుకుంటాం

మంత్రి శ్రీధర్‌బాబు

సుభాష్‌నగర్: రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న వారికి అండగా ఉంటామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. కొంపల్లి మున్సిపల్ దూలపల్లి ప్రధాన రోడ్డు ప్రస్తుతం 60 ఫీట్లు ఉంది. జనాభా పెరుగుదల, వాహనాల రద్దీ దృష్ట్యా 100 ఫీట్ల రోడ్డు విస్తరణ చేపట్టేందుకు మున్సిపల్ అధికారులు ఇటీవల వారం రోజుల్లో ఖాళీ చేయాలని 116 మంది షాపు యజమానులకు నోటీసులు అందజేశారు. షాపులు కోల్పోతున్న వారికి ఎలాంటి పరిహారం ఇవ్వబోమని అధికారులు చెప్పారు. దీంతో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సహాయంతో మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై బుధవారం సాయంత్రం దూలపల్లిలో షాపులు కోల్పోతున్న యజమానులు, కొంపల్లి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, స్థానిక తహసీల్దార్ మతిన్‌లతో సమావేశమయ్యారు. బాధితుల సమస్యను తెలుసుకున్నారు. మార్కెట్ రేటు ప్రకారం డబ్బులు ఇప్పించాలని మంత్రిని కోరారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రెండు రోజుల్లో హెచ్‌ఎండీఏ అధికారులతో సమావేశమై షాపు కోల్పోతున్న వారికి పరిహారం, ఇల్లు మొత్తం కోల్పోతున్న వారికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి కొలను హనుమంత్‌రెడ్డి, మాజీ పీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గరిసే నరేందర్‌రాజు పాల్గొన్నారు.



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, బాధితులు

20 నుంచి నిజాంపేట్‌లో బోనాలు



సమావేశంలో పాల్గొన్న పెద్దలు

నిజాంపేట్: తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు నిలువుటద్దంగా నిలిచేది బోనాల పండుగ. ఊరూరా అన్ని వర్గాల వారు ఎంతో భక్తి శ్రద్ధలతో ఈ పండుగ జరుపుకుంటారు. ప్రతీ సంవత్సరం ఆషాఢమాసం మొదట్లో ప్రారంభై నెలాఖరు వరకు బోనాల ఘనంగా నిర్వహిస్తారు. బుధవారం నిజాంపేట్ గ్రామం పరిధిలో పెద్దల సమక్షంలో బోనాల పండుగపై సమీక్ష నిర్వహించారు. ఈ నెల 20 నుంచి బోనాల పండుగ జరుపుటకు నిర్ణయించారు. కార్యక్రమంలో కొలన్ నరసింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాయి యాదవ్, రాజమోహన్‌రెడ్డి, తలారి వీరేష్, నాగేష్, మేకల బాలకృష్ణ, క్రాంతి, యాదయ్య, జీతయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు కార్పొరేట్ వైద్యం

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: పేద ప్రజలు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని పొందుతున్నారని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. మహేష్, కోట వెంకటేష్, ప్రసాద్, షహనాజ్ బేగం, షహీన్ ఫాతిమా, కొంగరి ఎల్లేష్‌లకు రూ.2.46 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. ఆ చెక్కులను బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం లాంటిందన్నారు.



చెక్కులు అందజేస్తున్న కూన శ్రీశైలంగౌడ్

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



కుత్బుల్లాపూర్: విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని ఇండియన్ ఎయిన్ ఫోర్స్ రిటైర్డ్ అధికారి శ్రీధర్ అన్నారు. బుధవారం కొంపల్లి నారాయణ సీబీఎస్‌ఈ పాఠశాలలో విద్యార్థుల క్యాబినెట్ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన శ్రీధర్, నారాయణ విద్యా సంస్థల జోనల్ డీజీఎం గోపాల్ రెడ్డి, ఏజీఎం పురుషోత్తమ్‌రెడ్డి హెడ్‌గర్ల్, హెడ్ బాయ్, డిప్యూటీ హెడ్‌గర్ల్, డిప్యూటీ హెడ్‌బాయ్‌లతో పాటు ఆయా తరగతుల లీడర్లకు బ్యాడ్జీలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. చిన్నతనం నుండే లక్ష్యాలను ఏర్పర్చుకుని వాటిని సాధించేందుకు పట్టుదలతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భార్గవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆదర్శంగా ఉండాలి



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నిజాంపేట్: రవీంద్ర భారతి స్కూల్ నిజాంపేట్ బ్రాంచ్‌లో ఇన్వెస్టిచర్ సెర్మని కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. విద్యార్థి దశలోనే విద్యార్థుల నాయకత్వ లక్షణాలను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఫ్లైట్ లెఫ్టినెంట్ కంచన్ (సీనియర్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్) హాజరై విద్యార్థులకు బ్యాడ్జ్ ప్రదానం చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఇతరులకు ఆదర్శంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ లైన్ల నిర్వహణ నేపథ్యంలో సరఫరాలో అవాంతరాలు ఏర్పడనున్నాయని కొంపల్లి సెక్షన్ ఏఈ శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ జయభేరి ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జయభేరి బ్యాంక్ కాలనీ, జయభేరి శివాలయం రోడ్డు, శ్రీనివాస కాలనీ, 11కేవీ గార్డెన్ సొసైటీ ఫీడర్ ఫిడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జయభేరి కాలనీ, గార్డెన్ సొసైటీ అపార్ట్‌మెంట్స్, హైవిజన్ అపార్ట్‌మెంట్స్, ఉమామహేశ్వర కాలనీల్లో సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

పేట్‌బషీరాబాద్ సెక్షన్‌లో..

11కేవీ గాయత్రినగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గాయత్రినగర్, గోదావరి హోమ్స్, 11కేవీ ప్రాగాటూల్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రాగాటూల్స్ కాలనీ, బీహెచ్‌ఈఎల్ విస్టా, ఆదిత్య విల్లాస్, శాంతా శ్రీరామ్ అపార్ట్‌మెంట్స్, దుర్గా విహార్, లక్ష్మీగంగా అపార్ట్‌మెంట్స్, ఎన్‌సీఎల్ గోదావరి అపార్ట్‌మెంట్స్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు.

చింతల్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు బోయిన్‌పల్లి ఏడీఈ శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ తిరుమలగిరి సబ్‌స్టేషన్ సత్యసాయి ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సత్యసాయి ఎన్‌క్లేవ్, టీచర్స్ కాలనీ, ఇంద్రానగర్, ఎల్.బి కాలనీ, 33/11 కేవీ బోయిన్‌పల్లి సబ్‌స్టేషన్ ప్లాసీ లైన్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ప్లాసీ లైన్, బోయిన్‌పల్లి మెయిన్ రోడ్డు, ఆర్ఆర్ నగర్ రోడ్డు నంబర్ 1 నుంచి రోడ్డు నంబర్ 10 వరకు, బోయిన్‌పల్లి చెక్ పోస్ట్, బోయిన్‌పల్లి కరెంట్ ఆఫీస్, హోండా షోరూమ్, శ్రీసాయి కాలనీ, శారద ఆగ్రో, ఆర్మూర్ భవన్, ఎంబీఎన్ ఎస్టేట్స్ తదితర ప్రాంతాల్లో చెట్ల కొమ్మల తొలగింపు, ఏబీ స్విచ్‌ల మార్పుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏడీఈ కోరారు.

సుభాష్‌నగర్: సమ్మర్ యాక్షన్ ప్లాన్ పనులు, ఫీడర్ల మరమ్మతుల నేపథ్యంలో గురువారం గాజులరామారం సెక్షన్ పరిధిలో సరఫరాలో అంతరాయం కలుగనుందని ఏఈ చైతన్య భార్గవ్ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ హెచ్‌ఎల్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉషోదయ కాలనీ ఫేజ్ 1, 11కేవీ మెట్‌కానిగూడ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శ్రీవెన్ ఎన్‌క్లేవ్, ఆదర్శనగర్, దేవభూమినగర్, మెట్‌కానిగూడ, అయ్యప్పస్వామి ఆలయ లేన్, ఒక్షిత్ ఎన్‌క్లేవ్, వీనస్ ఎన్‌క్లేవ్ ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.